# సబ్బు బిళ్ల

స్థలం - చతుర్వటి. ఛీ, ఛీ, కథను మొదలు పెట్టడమే బాగులేదు. ఇలాంటి ఒక స్థలం గురించి పాఠకులు ఎవరూ విని వుండరు. అయినా ఫరవాలేదు. వివరించేటప్పుడు అర్థమౌతుంది గదా! ఇక్కడ నుండి ఒక పదిక్రోసులు నడిస్తే మనకంతా తెలిసిన ఒక స్థలానికి చేరుతాం. అది మనందరికీ సుపరిచితమైన ఒక క్షేత్రం. దానిపేరు 'పంచవటి'. అక్కడనుండి ఇరవై క్రోసుల దూరం వెళితే 'షష్టివటి' వస్తుంది. 'సప్తవటి' చేరాలంటే అక్కడనుండి దాదాపు యాభై క్రోసుల దూరం వెళ్లాలి. ఇంకొక వందక్రోసులు వెళితే 'అష్టవటి' వస్తుంది. 'అష్టవటికి అష్టముడి'కి ఏదైనా పరస్పర బంధం వుందా లేదా అని మీరడిగితే నేనేం చెప్పగలను? ఇంకా చాలా దూరం వెళితే 'నవవటి' వస్తుంది. సముద్రం దాటి వెళితే 'దశవటి'ని చేరుకుంటాము.

మన కథా విషయం - రామాయణ కాలంలో జరిగిన ఒక సంఘటన. అయితే ప్రథమవటి - దశవటి మధ్యలో ఏదో ఒక బంధం వుండి వుండవచ్చు. చరిత్ర-పౌరాణిక - భూమిశాస్త్ర పరమైన సాక్ష్యాలను పరిశీలించినట్లయితే, ఈ రోజుకు కూడా ఒక రకం. రామ-రావణ యుద్ధం జరుగుతున్న శ్రీలంకే దశవటి అయి తీరాలి. సాక్షాత్ శ్రీరామచంద్రమూర్తి వారి జన్మస్థానము అని చెప్పబడుతున్న -- ఈ మధ్యనే మహమ్మదీయుల ఒక మసీదు ధ్వంసమైన -- ఆ అయోధ్యే కావాలి ప్రథమ వటి. ఆ రోజుల్లో ప్రథమంలో దశరథుడు, దశమంలో దశముఖుడు రాజ్యపాలన సాగిస్తున్నారని మనకు తెలుసు. ఆ రథసారథి పక్కా క్షత్రియుడు - ముఖుడు? ద్విజుడే కదా!

కథ దారి తప్పి, అడవి దారికి పోతున్నట్లుంది. పరవాలేదు. కథ జరిగింది అడవిలోనే. అయితే చెప్పుతూ వచ్చేది చతుర్వటి గురించి. ఆ రామాయణ కాలంలో అక్కడ వున్నది 'వటి' కాదు 'వాటి' కాదు చాలా భయంకరమైన అరణ్యం. రావణుడి పుష్పకవిమానం నుండి ఒక 'ఏరియల్ సర్వే' చేసి వున్నట్లయితే, ఆ భూభాగమంతా ఒక మరకత తివాచీ పరచినట్లు వుంటుంది.

కాని ఆ రోజుల్లో విమానం ఎక్కకుండానే 'ఏరియల్ సర్వే' చేయడానికి సమర్థత కలిగిన వాళ్లు చాలా మంది వుండేవాళ్లు. దేవతలందరూ, ఎగిరే పళ్లాల్లాగా పదునాలుగు లోకాల్లో, తిరిగే వాళ్లట. నారదమహర్షి తన తంబురా వాయిస్తూ, ఒక డీజిల్ ఇంజన్ కూడా అమర్చుకోకుండా అఖిలాండ మండల వార్తాపత్రికవలే స్వేచ్ఛా విహారము చేయుట, ఏషణివిద్య (చాడీలు చెప్పడం)కు ప్రైవేటు ప్రాక్టీసు చేయుట, ఒక స్థిర బ్రహ్మచారి అనే వేషం వేయడంవల్ల, అన్ని లోకాల్లో వున్న అందమైన స్త్రీ జనాల చుట్టూ తిరిగి, వాళ్లతో శృంగార సంభాషణలు జరుపుట అనే విషయాలు అందరికీ తెలిసినవే. తర్వాత గంధర్వ, కిన్నెర, కింపురుషులు ఎగిరే ప్రతిభ గురించి ప్రత్యేకంగా చెప్పడం అవసరం లేదు. ఇదంతా కాకుండా, కొంతమంది సీనియర్ మహర్షులు 'సోలో' ఫ్లైయింగ్ చేసినట్లు సర్టిఫికెట్ లేకున్నా, ఏలాంటి లైసెన్సు లేకున్నా ఫ్లైయింగ్ మాత్రం వారిష్టమొచ్చినట్లు చేసేవారు. ఇలాంటివి ఎన్ని జరిగినా ఎవరికీ ఏమాత్రం 'డేంజర్' వుండేది కాదు. ఎందుకనగా 'న్యూక్లియర్' లేక 'నాన్-న్యూక్లియర్' 'వార్‌హెడ్స్' కానీయండి 'మిసైల్స్' కానీయండి. వారివెంట తీసుకొని వెళ్లేవారు కాదు. కాని ఆ రోజుల చక్రవాళములో 'డేంజర్' గల కొన్ని 'ఫ్లైయింగ్ ఆబ్జక్ట్స్' (ఎగిరే వస్తువులు) కూడా ప్రత్యక్షమౌతుండేవి -- అనగా కొంతమంది రాక్షసులు గూడా ఎగిరే సమర్థత కలిగి వుండేవారు -- వాళ్లకు కామరూప విద్య కూడా బాగా తెలుసట.

అలాంటి ఒక రాక్షసస్త్రీ అంటే సాక్షాత్ శూర్పణఖ గగన విహార మధ్యలో ఒక రమణీయ భూభాగము దర్శించి, ముగ్ధురాలై దిగింది -- చతుర్వాటిలో. ఎక్కడ చూసినా, ఫలపుష్పభరిత వృక్షాలు, గలగలమనే నిర్విరామ సంగీతం ఆలపిస్తూ, నిత్య పులకితగా ప్రవహిస్తున్న కాంతార తరంగిణి యొక్క స్ఫటిక సమాన నిర్మల జలం చూసినప్పుడు ఆమె ఇంక ఏ మాత్రం ఆపుకోలేక పోయింది. వేషభూషణలు తీసి పారవైచి, వందశాతం నగ్నంగా, ఆ శీతల తోయంలో, ప్లవనక్రీడలో నిమగ్నమై తనను తానే మరచిపోయింది. ఎంతో కోమలమైన తన శరీరాన్ని చూస్తునప్పుడు, రోమహర్షము కలిగింది. ''నాలాంటి ఇంకొక శూర్పనఖ వుంటే, ఆ త్రైలోక్య సుందరిని నేను నా ప్రియసఖిగా వుంచుకొనే దాన్ని. కాని ఎక్కువ అవసరము నాకు కోమల యువకుడితోనే గదా. ఆ మహర్షి ఇచ్చిన వరము సఫలము కావాలంటే ఒక సుందర పురుషుణ్ణి వెతికి తీరాలి'' అనే ఆలోచన రాగానే, జలక్రీడ ముగించి, తన వస్త్రాల దగ్గరకు వెళ్లింది. తన 'వ్యానిటీ బ్యాగ్' తెరచి చూసింది. ఋషిపుంగవుడు తనకు వరప్రసాదంగా ఇచ్చిన సబ్బు దాంట్లో భద్రంగా వుంది. క్రితంరోజు, ఆమె ఆ జన్మదిన రూపంలో ఎంతోసేపు నృత్యం చేసినతరువాతనే, ఆ నిమీలిత నేత్రధారి కొంచెం కళ్ళు తెరిచాడు. తన కోకిల కంఠం నుంచి వెలువడిన 'మీరా భజన్' వినడం వల్లనో, లేక తన పాద సరాలలో మరియు కటి భూషణములో వ్రేలాడుతున్న చిరుమువ్వల, నృత్త, తాళ, నాదావళీ శ్రవణం వల్లనో తపోభంగం కలిగి కదా ఆయన కళ్లు తెరిచింది?

కోపాధిక్యంవల్ల, వారు తనను ఎక్కడ భస్మం చేస్తారోనని ఆ అతిలోక సుందరి గజగజలాడింది. కాని, 'కామసూత్ర' అనే 'కంపెనీ' వారి గర్భ నిరోధక రబ్బరు గొట్టము ప్రకటన చూసినట్టు, ఒక మధుర ముఖప్రసాదం ఆయనలో కనిపించింది. దిగంబర సన్యాసియైన వారి కళ్లముందు కొద్దిగానైనా ఆంచలంతో ఆ లావణ్యవతి ఆచ్ఛాదితయై వుండి వుంటే ఆ కోపిష్ఠి తనను నిందించినట్టు అనుకొని వుండేవాడేమో. పాలరాతితో చెక్కి శిల్పంగా చేసినట్లున్న ఆ భాసుర సుందర శరీరం, ఆ దివ్య నేత్రాలద్వారా, ఈశ్వరారాధనలో పూర్తిగా నిమగ్నమైయున్న వారి మస్తిష్కయవనికలో, ఒక తోకచుక్క మెరిసినట్టు, వారి భావరహిత వదనంలో ఒక చిరుచిరు నవ్వు, క్షణమాత్రం స్ఫురించింది. ఆ ఉమేతిరం (అంటే ఊర్వశీ, మేనకా, తిలోత్తమా, రంభా) వర్గానికి చెందిన ఆ అభామసుందరి ఎవరు? ఆమె ఎందుకు తనకు ప్రీతిపాత్రం కావడానికి ప్రయత్నించింది? అని తెలుసుకున్న ఆ మునిరత్నం ముకుళిత హస్తాలతో, తనకెదురుగా నిల్చున్న తరుణీమణిని తన దగ్గరకు రమ్మని సైగ చేశాడు. ఆమె దగ్గరకు రాగానే ఆమె చేతిలో ఒక పొట్లం ఇచ్చాడు. ఆయన ఒక పలుకు కూడా పలక లేదు. వరప్రసాదం దొరికిన వెంటనే, ఇంకొక నమస్కారం పారేసి శూర్పణఖ మాయమైంది. ఋషివల్యుడికి కూడా మనస్సమాధానము తిరిగి వచ్చింది. శూర్పణఖ యొక్క న్యాయమైన అభ్యర్థన, తను తిరస్కరిస్తే, రావణుడి ప్రమదగణాలు వచ్చి కోసుకొని వెళ్లేది తన తలకాయనే అని ఋషీంద్రుడికి బాగా తెలుసు.

ఏమీ ఆలస్యం చేయకుండా శూర్పణఖ లంకలోని రాజ సౌధానికి వెళ్లి, తన శయ్యాగృహంలో పట్టుపరుపై పడుకొని, ఆ పొట్లం విప్పి చూసింది. అది ఒక దివ్య పరిమళంగల సబ్బు. సబ్బు పేరుగాని, సబ్బు కంపెనీ పేరుగాని సబ్బుపై లిఖించి లేదుగాని, దాన్ని ఆవరించడానికి వాడే, బెరడు లోపలి భాగంలో ఆ సబ్బును వాడాల్సిన సూచనలు వ్రాసి వున్నాయి. 'కామేచ్ఛ' పుట్టగానే ఆ సబ్బు వాడి స్నానం చేసి, కామభాజనం దగ్గర చేరితే కామ భాజనానికి స్నానం చేసి వచ్చిన వ్యక్తిమీద కామేచ్ఛ కలిగితీరుతుంది. ఆ సమయంలో, కామ పాత్రంపైనే మనసు కేంద్రీకరించాలని, ఇంకొక వ్యక్తి గురించి, ఆ క్షణంలో తలుచుకున్నా గూడా, ఆ సబ్బు యొక్క ప్రత్యేక ప్రభావం నశించిపోతుందని కూడా ఆ సూచనలలో వుంది.

శూర్పణఖ ఆనందోన్మాదాలు హద్దులు దాటివెళ్లాయి. అదే సమయంలో ఆమెకు కొంచెం నిరాశకూడా కలిగింది. ఈ లంకా రాజ్యంలో సుందర పురుషులెవ్వరూ లేరు. ఒకవేళ వున్నా వాళ్లకొరకు ఈ సబ్బును వాడనవసరం లేదు. ఏమైనా ఇప్పుడు చాలా రాత్రయింది. అందువలన రేపు ఉదయమే ప్రపంచ దర్శనానికి బయలుదేరుతాను. సబ్బు తోసుకొని బయలుదేరితే చాలు మంచి అందగాణ్ణి చూసినప్పుడు, ఎలాగైనా ఈ సబ్బు వాడి స్నానం చేయాలి. అనవసరంగా వేకువజామున్నే ఎందుకీ చల్లనీళ్లలో స్నానం చెయ్యాలి?

ఆ విధంగా, ఆరోజు, ఆ నిశాచరి, ఆ ప్రభాత సమయమే గగన గమనం ప్రారంభించింది. దక్షిణభారతం అనే భూభాగం ఆమెకు చాలా నచ్చింది. ఇది మొదటి సారికాదు ఆమె వ్యోమ వీక్షణం చేసేది పొరుగు ప్రదేశం కావడంవల్ల. ఎన్నోసార్లు ఆమె ఆ ప్రదేశం చూసింది. మాటిమాటికి చూడడంవల్ల ఆ రమణీయ ప్రదేశంపై మక్కువ ఎక్కువ కలుగుతూ వచ్చింది. ఓహ్! ఏమందం! ఎంత అందం? శూర్పణఖ తన్ను తాను మరచిపోయి అప్పుడప్పుడు ''స్లో మోషన్'' లో కూడా ప్రయాణిస్తుంది. కొన్ని ప్రత్యేక ప్రాంతాలు ఆమెకు ఎక్కువ ఆకర్షణీయంగా అనిపించాయి. భూమికి చాలా దగ్గరగా ఎగురుతూ సుందర పురుషులను వెతుకుదాం అని అనుకొన్నా, ఆ భూ సౌందర్యం చూసి ముగ్ధురాలై ఇంకా కొంచెంసేపు దాన్నే చూద్దామని, తర్వాత మగవేట ప్రారంభిద్దామని నిర్ణయించుకొంది. ఆ విధంగా ఎగురుతూ, ఎగురుతూ అతి మనోహరమైన ఒకచోట ఆమె దిగింది. ఆ ప్రదేశం పేరు 'చతుర్వటి' అని ఆమెకు తెలియదు. ఈ రోజుల్లో ఏర్పాటు చేస్తున్నట్లు, అడవుల్లో కూడా మైలురాళ్లు వేసే చెడ్డ అలవాట్లు ఆ రోజుల్లో మనుష్యులకు వుండేది కాదు.

ప్రకృతి సౌందర్యం ఆస్వాదిస్తూ ఆమె ఎన్నో క్రోసులు నడిచింది. హఠాత్తుగా, ఆశ్చర్య స్తబ్ధురాలై నిలబడిపోయింది. తన కళ్లను తనే నమ్మలేకపోయింది. కళ్లను చేతులతో నులుముకొని, ఎంతో కుతూహలంతో వీక్షించింది. వెతకబోయిన తీగ కాళ్లకు చుట్టుకున్నట్టు ఆమెకు వర్ణనాతీతమైన ఆహ్లాదం కలిగింది. ఈ ఘోరార ణ్యంలో పర్ణకుటీరం ఎలా వచ్చింది? ఈ కుటీరం చుట్టూ, ఇంత మంచి పూలతోట ఎవరు పెంచారు? ఇలాంటి ప్రశ్నలు ఆమె మనసులో వచ్చాయి గాని, ఆమెకు నిజంగా ఉల్లాసం కలిగించినవి ఇవేమీ కావు. అదేమిటంటే - కుటీరం ముందు కొంచెం దూరంగా, అందమైన ఒక హరిత వృక్షం క్రింద, ఒక పీఠంపై కూర్చున్న కోమల యువకుడు ఎవరు? ఒక ముని కుమారుడిలా వున్నా, ప్రక్కన పెట్టిన ధనుర్బాణాలు చూస్తే అతను అహింసా సిద్ధాంతాన్ని ఆచరించే వాడిలా లేడు. ఆ ముఖంలో వున్న గాంభీర్యం, శరీరంలో కనపడుతున్న దృఢమైన కండరాలు - అతనొక రాజవంశానికి చెందిన క్షత్రియ కుమారుడని తెలుపుతున్నాయి. అతి సుందరుడని అహంకరించే దేవేంద్రుడిని ఆమె చూసి వుంది. ఆమె అభిప్రాయంలో ఆ సహస్రాక్షుడు, మగవేషం వేసుకున్న ఆడపిల్లలా వుంటాడు. కాని, ఈ సుకుమారుడిలో ప్రస్ఫుటమవుతున్న ఆ పురుషత్వం -- ఓహ్! మనసును, శరీరాన్ని ఒకేసారి వుక్కిరిబిక్కిరి చేస్తుంది. కొంచెంసేపు అలానే చూస్తూ నిలబడితే, తాను కామావేశంతో మరిగిపోతుందేమోననే, ఒకరకం బలహీనత ఆమెను ఆవరించడంవల్ల, మెల్లగా కదలి తర్వాత పి.టి. ఉష లాగా పరుగెత్తి ప్రక్కనే వున్న సరోవరంలో దూకింది. ఋషి మహాత్ముడు వరంగా ఇచ్చిన సబ్బుతో బాగా స్నానం చేసింది. ఆమె గుండె దడ పెరుగుతూ వచ్చింది. తనతోపాటు జలక్రీడానందం అనుభవించడానికి, ఆ మనోహర కుమారుడు వచ్చి వుంటే ఎంత బాగుండేది! కానీ, తనకా అదృష్టం కలగడానికి ఇంకెంతోసేపో ఎదురు

చూడాల్సిన అవసరం లేదు. ఈ నబ్బు పరిమళంతో, తన తనువు ఆ యువకుడిని సమీపించే సరికి, అతను దిగ్గున లేచి అతని బలిష్ఠ బాహువులలో బంధించి ఊపిరి సలపనీయకుండా, తన శరీరం అంతా ముద్దులతో ముంచేస్తాడేమో? ఇంక ఏ మాత్రం ఆగడానికి వీలు లేనట్లు, కనీసం ఆ పర్ణకుటీరం లోపలకు వెళ్లడానికి కూడా ఓపిక లేనట్లుగా, ''ఎవరైనా వచ్చి చూస్తే -- అర్థగర్భంగా నవ్వితే'' అని కూడా ఆలోచించ కుండా, అక్కడే, ఆ వృక్షము క్రిందనే, హరిత శాద్వల శయ్యపై, తనూ, ఆ మన్మథుడు రతిక్రీడావళిలో నిమగ్నులై దొర్లుతూ మర్లుతూ వుంటామేమో. ఆమె వక్షద్వయాల ఆటుపోటులు పెరిగాయి. సిరలలో రక్తం నురుగులతో మరుగుతుందా? తొడలలో వణుకు అధికమై అవి రెండు కొట్టుకుంటూనే వున్నాయా! రోమాంచానికి ఒక్క క్షణం కూడా విరామం లేదే!

స్నానాంతరం వస్త్రధారణ గావించుకొని, పురుష సామీప్యం కొరకు ఆమె పరిగెడుతూ వచ్చింది. ఆ కోమలగాత్రుడు ఏదో దీర్ఘాలోచనలో నిమగ్నుడై వున్నాడు. శూర్పణఖ చాలా దగ్గరకు వచ్చిన తర్వాతనే అతను ఆమెను చూశాడు. ఆశ్చర్యచకితుడై ఒక్క ఉదుటున లేచాడు. పూర్ణవికసిత నేత్రాలతో వీక్షిస్తూ అతనడిగాడు.

''ఎవరమ్మా నీవు? ఈ ఘోరారణ్యం మధ్యలో ఎలా రావటం జరిగింది?''

దానికి ఆమె సమాధానము చెప్పలేదు. ఒక బల్లమీద వివిధ రకాల ఐస్‌క్రీములు పెట్టినప్పుడు, వాటిని కక్కుర్తితో చూస్తున్న ఒక చిన్న అమ్మాయి ముఖభావం ఆమె సుందర వదనంలో ప్రకటితమయింది. పద్మపత్ర విశాలాక్షిగా ఆమె అడిగింది.

''మీరెవరు? మానవులా? గంధర్వులా?''

''దశరథతనయుడు, శ్రీరామచంద్ర సోదరుడినైన లక్ష్మణుడిని. ఇప్పుడు నువ్వెవరో చెబుతావా?''

''పరమశివుడి పరమభక్తుడైన లంకాధిపతి దశముఖుడి సోదరిని, శూర్పణఖను. ఈ కానన సౌందర్యం ఆస్వాదిస్తూ, వెళుతూండగా మీ దర్శన మహాభాగ్యము లభించింది.''

ఈ విధంగా వారి సంభాషణ ముందుకు వెళుతూంది. ఈ సందర్భంలో, కథాగమనం నుంచి దారితప్పడం సమంజసంగా లేదుగాని చెప్పాల్సిన విషయం చెప్పాల్సిన సమయంలో చెపితే బాగుంటుంది. ఈ శూర్పణఖోపాఖ్యానం ఒక్కొక్క రామాయణంలో ఒక్కొరకంగా వర్ణించబడింది. పంచవటిలో, పర్ణశాల దగ్గర, కాపలాకాస్తున్న లక్ష్మణుడినే ఆమె ముందు సమీపించింది, అని ఒక రామాయణంలో చెప్పగా, ఇంకొక రామాయణంలో- శ్రీరాముడి దగ్గరికే మొదటగా వెళ్ళి ప్రేమాభ్యర్థన చేసిందని వివరింపబడింది. కాని, ఆమె ఇద్దరి దగ్గరకు వెళ్లిందనే విషయంలో,

రామాయణ రచయితలలో భిన్నాభిప్రాయం లేదు. అందుకే ముందు చెప్పిన ఆ చిన్న అభిప్రాయ భిన్నత గురించి, ఒక ప్రత్యేక పరిశోధన అవసరం లేదని ఎవరైనా ఒప్పుకుంటారు. ఒకవేళ శూర్పణఖ, లక్ష్మణుడు, రాముడు లేక సీత వీళ్లెవరైనా ఈ రోజు బ్రతికి వున్నట్లయితే, ఎప్పుడో కాలహరణం అయిపోయిన ఆ నిస్సార విషయం గురించి వాళ్ళల్లో ఎవరికి గూడా జ్ఞాపకం వుండదని అనుకొంటూ, మనకథలోకి మళ్లీ ప్రవేశిద్దాం.

మొదటి కలయికలో కలిగిన ఆశ్చర్యము, మాధుర్యము ఎక్కువసేపు నిలబడలేదు. స్వంత భార్య నుండి చాలా దూరంగా, చాలా కాలంగా వున్నా 'పెళ్లయిన బ్రహ్మచారి' అనే ఒక వ్యక్తికి 'పత్నీవ్రత్యం' ఎంతవున్నా కూడా అడవి మధ్యన, ఏకాంత ప్రదేశంలో, అందమైన అవకాశం లభించినపుడు, అతను దాన్ని వదలిపెడతాడు అంటే అది స్వాభావికం కాదని ఏ మగవాడైనా చెబుతాడు. ఇక్కడ శూర్పణఖ ఆగమనం లక్ష్మణుణ్ణి కొంచెం 'చంచల్ బాబు'గా మార్చేసింది కాని, ఎక్కువ పరిచయం అవడానికి ముందుగానే, అతను స్వప్నంలో కూడా అనుకోలేని విధంగా ఛటుక్కున ఆమె ఒక 'లవ్ అప్లికేషన్' సమర్పించేసరికి, లక్ష్మణుడికి ఒక 'రివర్స్‌గెయర్' పడింది అని చెబితే అది అతిశయోక్తి కాదు. ఎంత 'డాషింగ్ బ్యూటీ' అయినా, తనే వచ్చి దాడిచేసినప్పుడు మామూలు మగవాళ్లకు మామూలుగా ''స్టార్టింగ్ ట్రబుల్'' మొదలవడంతో, అస్వాభావికత లేదనే మాట అనుభవం ద్వారా నేను కూడా తెలుసుకున్నాను.

''శూర్పణఖా! నేను శ్రీరామచంద్రుడికి మామూలు దాసుణ్ణి మాత్రమే. నేను, నా జ్యేష్ఠభ్రాతకు, సీతమ్మ తల్లికి సేవలు అందించడానికి మాత్రమే, నా ప్రియ ధర్మపత్నిని వదిలి ఇక్కడకు వచ్చాను. ఇక్కడకు వచ్చి సుఖించడం కాదు నా అభిమతము. వాళ్ల సౌఖ్యమే నా ఏకైక లక్ష్యం. నా జ్యేష్ఠభ్రాత ఆజ్ఞానుసారమే, నా ఉచ్ఛ్వాస, నిశ్వాసాలు కూడా వర్తిస్తాయి. అంతేకాకుండా ఒక దాసిగా వుండడం, నీకు నచ్చదని నేను అనుకుంటున్నాను. అదిగో వాళ్లు వెలుపలికి వేంచేస్తున్నారు.''

శూర్పణఖ పర్ణకుటీరం వైపు తిరిగి చూసింది. ఆ దృశ్యం చూసి ఆమె కళ్లు మిరుమిట్లుగొల్పాయి. ఆ దంపతుల దివ్య సౌందర్యాన్ని ఆమె నమ్మలేకపోయింది. లక్ష్మణుడిని చూసి, ఆ పురుష శరీరాన్ని తనదానిగా చేసుకోవాలని ఆశించిన ఆమెకు శ్రీరాముడి రూపము చూసిన తర్వాత ఆ పాదారవిందాలపై, తనను అర్పితం చేసుకోవాలని అనిపించింది. దైవ స్వరూపుడితో కూడా ప్రేమభిక్ష యాచించింది. ఒక చిరునవ్వుతో ఆయన ద్వి-భార్యా జీవితం తెచ్చే అనర్థాలను వివరించాడు. స్త్రీ సంపర్కమే లేకుండా బ్రతుకుతున్న తన తమ్ముడి మిత్రత సంపాదించమని ఉపదేశించాడు. ఆ ఇద్దరు సహోదరుల మధ్యన ఆమె ఒక ''ఫుట్‌బాల్''గా మారింది. చివరకు, ఇదంతా చూస్తూ నవ్వుతున్న సీతపై మళ్ళింది- ఆమె కోపమంతా! సీతలాంటి ఒక

కమనీయ యువతి అక్కడ వుండకపోతే, వీరిద్దరూ కూడా, తన ప్రేమకోరికను స్వీకరించడం మాత్రమే కాదు, వాళ్ల కామకేళీలతో, తనను ఊపిరిసలపనీయకుండా చేసి వుండేవారు అని అనుకొని శూర్పణఖ తన భీకరరూపంలోకి మారి, సీతాదేవిని హతమార్చడానికి ముందుకు వెళ్లింది. మెరుపు వేగంతో లక్ష్మణుడు తన కరవాలము తీసి ఆ రాక్షసి ముక్కు, పర్వతాకార స్తనములు, నిటారుగా నిలబడుతున్న బాహ్యకర్ణములు ఛేదించి వదలిపెట్టాడు. దిగంతాలు జడిసేటట్లు గర్జించి, రుధిర ధారలతో పారిపోతూ, ఆమె తన 'వ్యానిటీ బ్యాగ్'ను విసిరేసింది.

ఇక్కడ నుంచి అసలు రామాయణం ప్రారంభమవుతుంది. రామరావణ యుద్ధానికి, 'హరిశ్రీ' వ్రాసినది- శూర్పణఖను ''అరిస్త్రీ''గా మార్చిన ఈ సంఘటనే. ఇది జరిగి వుండకపోతే సీతాపహరణం అనే మహాపాపం ఆ శివభక్తుడు చేసి వుండేవాడు కాదు. అది కూడా జరిగి వుండకపోతే రామరావణ యుద్ధం జరిగేది కాదు. పదునాలుగు సంవత్సరాలు అరణ్యవాసం చేసిన తర్వాత వాళ్లు ముగ్గురు 'బీట్‌కానిస్టేబుళ్ల' లాగా నడచినడచి బాగా, అలసి సొలసి అయోధ్యకు చేరుకునేవారు.

ఆ విధంగా రామాయణం అనే సంభవ పరంపరకు కారణభూతమైన వస్తువు శూర్పణఖకు వరముగా లభించిన ఆ సబ్బే. బెరడు పొట్లంలో దాని పేరు గూడా లిఖించి వుంది-- కామేచ్ఛ. కామేచ్ఛవున్న ఒక వ్యక్తి ఆ సబ్బువాడి స్నానం చేసి ఇంకొక వ్యక్తి దగ్గరకు పోతే ఆ వ్యక్తికి గూడా వెంటనే కామేచ్ఛ కలుగుతుందనేదే కదా దాని ప్రత్యేకత?

రామాయణం కేవలం ఒక కథేనా? లేదా అది భారత చరిత్రలో ఒక అంశమేనా అని చాలా మంది వివిధరీతులలో ఆలోచించుట, అధ్యయనం చేయుట, పరిశోధన చేయుట చేశారు. జర్మనీవాళ్లు సంస్కృతం ఎక్కువగా నేర్చుకోవడానికి కారణం మన పురాణాల్లో వ్రాసిపెట్టిన కొన్ని నమ్మడానికి వీలులేని శాస్త్రీయ విషయాలు. పాశ్చాత్య దేశాలలో మనుషుల గగన గమనం అనే ఆలోచన రావడానికి ఎన్నో శతాబ్దాలకు ముందే, మన రామాయణంలో విమానం గురించి మంచి వివరణ ఇవ్వడం జరిగింది. ఆధునిక శాస్త్ర పురోగతి మనకు ఈ రోజు ప్రదానం చేసిన శుభ-అశుభ వస్తువులు-వస్తుతలు మన పురాణకాలంలో ఈ భారతవర్షంలో ఉపయోగింపబడినాయి అవి మన పురాణాలు ప్రకటిస్తున్నాయి. అందుకే తెల్లవాళ్ళు, ప్రత్యేకించి జర్మనీ వాళ్లు ఈ విషయాల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అనేక పరిశోధనలు చేయడం జరిగింది.

రామాయణం గురించి పరిశోధనలు జరుపుతుండగా, అయోధ్య, పంచవటి, శ్రీలంక అని చాలా స్థలాల్లో వాళ్లు త్రవ్వి చూశారు. ఆ ప్రయత్నాల్లో వాళ్లకు ఎన్నో పురావస్తువులు లభ్యమయ్యాయి. వాటిలో చాలా ప్రధానమైన ఒక నిధి వాళ్లకు పంచవటి సమీపంలో దొరికింది. అదే ఆ 'సబ్బుబిళ్ల'.

మనోవేదన మరియు శారీరక వేదనలతో పారిపోతున్న శూర్పణఖ తన 'వ్యానిటీ బ్యాగ్' పారేసింది గదా. భూమి త్రవ్వుతున్నప్పుడు ఆ వస్తువు బయటపడింది. ఆ వ్యానిటీ బ్యాగు బాగా జీర్ణించి పోయింది గాని, ఆ సబ్బు, చుట్టబడిన బెరడుకు ఎలాంటి 'డామేజ్' జరుగలేదు. ఒక ఋషీశ్వరుడి వరప్రసాదం కదా!

ఈ సబ్బు బిళ్ల విశ్లేషణము అతి రహస్యంగా జర్మనీలో ఒక ముఖ్యమైన పరిశోధనా కేంద్రంలో జరిగింది. ఈ సబ్బు తయారీలో ఏమేమి దినుసులు చేర్చబడ్డాయో అని సంవత్సరాల పాటు పరిశోధనలు జరిగాయి. పరిశోధనలు దాదాపు పూర్తి అయ్యే సమయంలో ఆ పరిశోధనా కేంద్రంలో, ఒక ముఖ్యపాత్ర వహించిన, ఒక బ్రిటిషు శాస్త్రవేత్త, పరిశోధనకు ప్రాణమైన ఆధారాలు అన్నీ కంఠస్థం చేసుకొని మాయమ య్యాడు.

తర్వాత వాణిజ్యపరమైన ఈ సబ్బు నిర్మాణము ఇంగ్లండులో జరిగింది. జర్మనీ వాళ్లకు తెలియకుండా వుండటానికో, లేక ఉచ్చారణలో వున్న యిబ్బంది వలననో వాళ్లు 'కామేచ్ఛ' అనే పూర్తి నామధేయం ఆ సబ్బుబిళ్లకు పెట్టలేదు.

ఈ రోజు లోకమంతా, ప్రపంచమంతా 'కామే' అనే పేరుతో ఈ సబ్బు చాలా ప్రశస్తమయింది. కాని, ఈ సబ్బు ప్రత్యేక గుణాలు గురించి ఈ కథ చదివేవాళ్లకు మాత్రమే అవగతమవుతుంది. దయచేసి ఇలాంటి కథలు చదవడానికి ఇష్టంలేని వాళ్లకు ఈ సబ్బు యొక్క దివ్యమైన, విశిష్టమైన 'కామేచ్ఛ' జనకమైన ప్రత్యేక గుణము గురించి మీలో ఎవరు కూడా చెప్పవద్దు. ఈ సబ్బులో వున్న రహస్యం మీరు ఇతరులకు చెప్పితే సబ్బు వాడినందువల్ల మీకు సంక్రమించవలసిన అమోఘగుణము నశించిపో తుంది.